

# చీకటికి వెయ్యికళ్ళు

## - కొమ్మూరి సాంబశివరావు



*"ఎవరు చేశారీ హత్య? హంతకుణ్ణి పట్టుకోవాలి. నిజం తెలుసుకోవాలి" అని మంగళ యుగంధర్ని వేడుకుంది.*

*"శవం ప్రక్కన పడున్న పిస్తోలు మీద వేలిముద్రలున్నాయి. హంతకుడు దొరికాడు అరెస్టు చేస్తున్నాను" అన్నాడు ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు.*

*"నీకేమీ భయంలేదు. నిన్ను విడిపించే బాధ్యత నాది" ధైర్యం చెప్పాడు లాయర్ వజ్రాలరావు.*

*మంగళ మర్యాదస్తురాలు. అతడు.. బికారి.. సన్యాసి.. నిందితుడు జైలుకి వెళ్ళి వచ్చిన మాజీ నేరస్థుడు. ఈ ముగ్గురికీ సంబంధం ఏమిటి?*

*లాయర్ వజ్రాలరావు జిత్తులమారి, మేధావి, దొంగలకూ నేరస్థులకూ సన్నిహితుడు.*

*డిటెక్టివ్ యుగంధర్ మొదటిసారి కోర్టులో వాదిస్తాడు. అద్భుతమైన పరిశోధన, సాక్షుల పరీక్ష, క్రాసు పరీక్ష.*

*(గత సంచిక తరువాయి)*

## 5

**"యస్! యుగంధర్ స్పీకింగ్."**

"నేను మంగళని"

"ఆ!"

"మీరు సహాయం చెయ్యాలి. నా చెల్లెలు సరళ కనిపించడం లేదు" అన్నది మంగళ ఆదుర్దాగా.

యుగంధర్ కనుబొమలు చిట్లించాడు. చేతి గడియారం చూసుకున్నాడు. రాత్రి పది గంటలయింది.

"ఇవేళ పొద్దున్న నుంచీ కనిపించటంలేదు. అంతేనా?"

"అవును"

"ఈ మాత్రం దానికి ఆదుర్దా పడనవసరం లేదేమో?"

"సామాన్య పరిస్థితులలో ఆదుర్దా పడేదాన్ని కాను యుగంధర్‌గారూ! పొద్దున్న సరళ ఇంట్లోంచి బయటికి వెళ్ళినపుడు ఆమె లక్షరూపాయలు ఖరీదు చేసే వజ్రాల నెక్లెస్ తీసుకువెళ్ళింది. మిమ్మల్ని కలుసుకుని మీకు క్షమాపణలు చెప్పింది. ఇవాళ మధ్యాహ్నం నెక్లెస్ ఇనప పెట్టెలో కనిపించకపోయేసరికి మా వారు పోలీసులకి రిపోర్టు ఇచ్చారని తెలిసింది. కనుక సరళ మావారి ఇంటికి వెళ్ళలేదు. మిమ్మల్ని కలుసుకున్నదా? ఎక్కడికి వెళతానని చెప్పింది? "

"కలుసుకుంది. తిన్నగా రామారావుగారింటికి వెళతానన్నది."

"అందుకే ఆదుర్దా. అంత ఖరీదయిన నెక్లెస్ తీసుకుని ఎక్కడికి వెళ్ళివుంటుంది? ఏమైవుంటుంది?"

"మీ చెల్లెలు చిన్నపిల్ల కాదుకదా ఆదుర్దా పడనవసరంలేదేమో" అన్నాడు యుగంధర్.

"యుగంధర్‌గారూ సరళ పెంకి మనిషి, ధైర్యశాలి కూడా. కాని అవివేకురాలు. లౌకికం తక్కువ. సులభంగా చిక్కుల్లో ఇరుక్కుంటుంది. అందుకని నాకు భయంగా ఉంది."

"ముందూ వెనకా ఆలోచించకుండా తోచినపనల్లా చేస్తే చిక్కుల్లో ఇరుక్కోరు మరి?"

"యుగంధర్ గారు మీరు పెద్దవారు. కుర్రతనంవల్ల అనాలోచితంగా ఏదైనా చేస్తే క్షమించగల ఔదార్యం మీకుంటుంది. సరళ ఏమైందో, ఎక్కడుందో తెలుసుకోండి, మీరు 'ఊ' అంటే చాలు. నాకు ధైర్యం వస్తుంది."

యుగంధర్ ఒక నిమిషం ఆలోచించాడు. "సరే నా అసిస్టెంటు రాజుని మీ దగ్గరికి పంపుతాను. అతను అడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పండి" అని రిసీవరు పెట్టేశాడు.

పక్కనే కూర్చున్న రాజు యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"రాజూ! ఈ కేసు చాలా అయోమయంగా ఉంది. వీళ్ళందరూ మోసగాళ్ళో లేక వీళ్ళల్లో కొంతమంది కొందర్ని మోసగిస్తున్నారో తెలియకుండా ఉంది. రామారావు ఇన్సూరెన్సు డబ్బుకోసం కాచుకున్నాడు. తన నెక్లెస్ పోలేదనీ, మంగళ దగ్గరే ఉన్నదని చెబితే అతను ఆ విషయం ఎవరికీ చెప్పవద్దనీ, నాకు లంచం ఇస్తాననీ అన్నాడు. ఇనపపెట్టె తాళం చెవి ఒకటి జోగయ్య దగ్గరే ఉంది. సరళ నెక్లెసు రామారావుకి ఇచ్చిన తర్వాత జోగయ్య నెక్లెస్ దొంగిలించాడా? సరళ నెక్లెస్ తెచ్చి తనకిచ్చింది కనుక మంగళ దగ్గర ఆ నెక్లెస్ లేదని రామారావుకి తెలుసుండాలి. అందుకే నెక్లెస్ చూపించమని నన్ను దబాయించాడా? జోగయ్య ఆడుతున్న నాటకం ఏమిటి? రామారావు ఇన్సూరెన్స్ డబ్బు తెచ్చుకున్నాక అతన్ని బ్లాక్ మెయిల్ చేద్దామనుకుంటున్నాడా? మంగళ కనిపించేటంత అమాయకురాలేనా? సరళ నెక్లెస్ ఎలాగో తెచ్చింది. తెచ్చిన తర్వాతనయినా దాన్ని తన దగ్గరే ఎందుకు ఉంచుకోలేదు? రామారావు ఏం చేయగలిగేవాడు కాదు కదా. చేజిక్కిన లక్షరూపాయల ఖరీదు చేసే నెక్లెస్ తిరిగి ఎందుకు పంపించేసింది? దాన్ని కోర్టు ద్వారానే రాబట్టుకోవాలని ఆమెకి ఎందుకా పట్టుదల? అన్యాయ మార్గంలో నెక్లెస్ సంపాదించడం ఆమెకి ఇష్టం లేదా? అయితే ఆమెకీ, ఆమె చెల్లెలికీ చాలా తేడా ఉందన్న మాట. ఏ విధంగానయినా సరే తనకి కావలసింది తెచ్చుకునే రకం సరళ. సరళ ఏమైంది? ఇక్కణ్ణించి ఎక్కడికి వెళ్ళింది? రామారావు ఇంటికి వెళ్ళిందా తను చేసిన పనికి సిగ్గేసి ఎవరికీ కనిపించకుండా దాక్కుందా? లేక నెక్లెస్ చిక్కింది కనుక దాన్ని తీసుకుని పలాయనం అయిందా? లేక ఆమె దగ్గర నెక్లెస్ ఉన్నదని తెలిసిన వారెవరైనా ఆమెని ఇక్కణ్ణించి వెంబడించి, రామారావు ఇల్లు చేరుకునే లోపున ఆమెని పట్టుకుని దాచిపెట్టారా?" యుగంధర్ మాట్లాడడం ఆపాడు. కొంచెం సేపు ఉండి "రాజూ సరళ ఏమైందో తెలుసుకోవాలి, నువ్వు వెంటనే ఆ పనిమీద బయలుదేరు" అన్నాడు.

●●●

రాజు తిన్నగా మంగళ ఇంటికి వెళ్ళాడు. దాసీదానికి తన పేరు చెప్పి మంగళకి తను వచ్చినట్లు చెప్పమన్నాడు. క్షణంలో మంగళ హాల్లోకి వచ్చింది.

"మీ చెల్లెలు సరళ విషయం కనుక్కుందామని వచ్చాను. నన్ను యుగంధర్‌గారు పంపారు. ఇక్కణ్ణించి సరళ ఎన్ని గంటలకి బయలుదేరింది?"

"పది గంటల ప్రాంతాన"

"దాదాపు పదిన్నరకి మా ఆఫీసుకి వచ్చింది. అంటే ఇక్కణ్ణించి తిన్నగా మా ఆఫీసుకే వచ్చిఉండాలి. ఇక్కణ్ణించి టాక్సీలో బయలుదేరిందా? " అడిగాడు రాజు.

"ఊహు దాసీదాన్ని పంపి టాక్సీ తెప్పించుకోమని చెప్పాను. అవసరం లేదన్నది. ఈ వీధి చివర టాక్సీ స్టాండున్నది. బహుశా అక్కడ టాక్సీ ఎక్కివుంటుంది."

"ఈ ఊళ్ళో మీ బంధువులెవరయినా ఉన్నారా?"

"లేరు"

"సరళ స్నేహితులు ఎవరయినా ఉన్నారా? ఎవరింటిలోనైనా ఉన్నదేమో?"

"కొద్దిమంది స్నేహితురాళ్ళు మాత్రమే ఉన్నారు"

"వాళ్ళ పేర్లూ, చిరునామాలు తెలిస్తే చెప్పండి" అని రాజు డైరీ తీశాడు.

"పార్వతి, రాయపురంలో మాడా స్ట్రీటులో 192 నెంబరు ఇంటిలో ఉంటున్నది. పార్వతి సరళ క్లాస్‌మేట్. కృష్ణవేణి, సుమతి అనే ఇద్దరు స్నేహితురాళ్ళున్నారు. జార్జి టవునులో ఎక్కడో ఉంటున్నారు. వాళ్ళ అడ్రసులు నాకు తెలియవు. బహుశా పార్వతికి తెలిసి ఉండవచ్చు."

"బెంగుళూరులో మీ మామగారి ఇంటిలో ఉంటున్నానని చెప్పింది సరళ. అక్కడికి వెళ్ళిందేమో? ఆయన అడ్రసు చెబుతారా?"

"నేను మామయ్యకి టెలిగ్రాం ఇచ్చాను. సరళ అక్కడకి రాలేదని మామయ్య దగ్గిరనుంచి టెలిగ్రాం వచ్చింది. తరువాత సరళ అక్కడికి వెళితే వెంటనే నాకు తెలియజేస్తాడు."

"గుడ్" అని రాజు లేచి నిల్చున్నాడు.

"మిస్టర్ రాజూ.. యుగంధర్ గారు నామీద కోపంగా ఉన్నారా?" అడిగింది, మంగళ కొంచెం దగ్గిరిగా జరిగి.

"అబ్బే లేదు" అన్నాడు రాజు.

"పొద్దున్న వారిని సరిగా మర్యాద చేయనందుకూ, నిజం చెప్పనందుకూ ఆయనకి కోపం వచ్చి ఉంటే క్షమించమనండి. నా మనస్సు బాగాలేదు. పొరబాటు చేశాను. ప్లీజ్. సరళ జాడలు తెలుసుకోవాలి. నాకు చాలా భయంగా ఉన్నది" అన్నది.

"దయచేసి మీ చెల్లెలి ఫోటో ఇస్తారా?" అడిగాడు రాజు.

మంగళ తల ఊపి లోపలికి వెళ్ళి ఫోటో ఆల్బం తీసుకు వచ్చింది. "మీకు ఇష్టమొచ్చిన ఫోటో ఏరుకోండి" అన్నది.

రాజు ఆల్బం తెరిచాడు. మంగళ, సరళ చిన్నప్పుడు తీయించుకున్న ఫోటోలు చాలా ఉన్నాయి. అక్కచెల్లెళ్ళు ఇద్దరికీ కనీసం నాలుగేళ్ళయినా తేడా ఉందని చిన్నప్పటి ఫోటోలు చూస్తే తెలుస్తుంది. సరళ తన స్నేహితురాళ్ళతో తీయించుకున్న ఫోటోలు చాలా ఉన్నాయి. చాలా ఫోటోలలో సరళని గుర్తుపట్టడమే కష్టం అయింది రాజుకి. గౌనులు వేసుకుంది. ఇంగ్లీషువాళ్ళ మల్లే డ్రెస్ చేసుకుంది.

"మేము బెంగుళూరులో కంటోన్‌మెంటులో ఉండేవాళ్ళం. అక్కడ ఆంగ్లో ఇండియన్సు చాలామంది ఉన్నారు. మాకు వాళ్ళతో స్నేహాలు ఎక్కువ. మేమూ అప్పుడప్పుడు గౌనులు వేసుకునేవాళ్ళం" అన్నది మంగళ.

రాజు ఒక ఫోటో ఆల్బంలోంచి ఊడదీసి, జాగ్రత్తగా డైరీలో పెట్టుకున్నాడు.

"మీరు భయపడకండి. బహుశా మీ చెల్లెలు ఎవరి ఇంటిలోనో ఉండి ఉంటుంది. కనుక్కుంటాము."

మంగళ బలహీనంగా నవ్వింది. "థాంక్సు. అయితే ఇంకేం కావాలి?" అన్నది.

రాజు తలుపువరకూ వెళ్ళి చటుక్కున నవ్వుతూ వెనక్కి తిరిగి "మంగళాదేవిగారూ.. మీచెల్లెలికి ప్రమాదమేదైనా సంభవించి ఉండవచ్చని మీరు భయపడటానికి కారణం ఏమైనా ఉన్నదా?" అడిగాడు.

"లేదు" అన్నది మంగళ. "లక్షరూపాయలు ఖరీదయిన నెక్లెస్ కూడా తీసుకెళ్ళింది కదా! అందుకే భయం"

రాజు అక్కణ్ణించి బయలుదేరి వీధి చివర ఉన్న టాక్సీ స్టాండు వద్దకు వెళ్ళాడు. సరళ ఆనవాలు చెప్పి ఆమెకి ఎవరయిన పొద్దున్న బాడుగకి వెళ్ళారా అని డ్రయివర్లని అడిగాడు.

ఒక డ్రయివర్ ముందుకు వచ్చి, "వీధి కొసన ఉన్న అమ్మగారేనా సార్? పొద్దున్న నా బండి ఎక్కారు." అన్నాడు.

"ఎక్కడ దిగారు ఆమె?"

"మౌ బ్రీస్ రోడ్డులో ఈ ఇంటి దగ్గర దిగారు."

అది తమ ఆఫీసే కనక రాజు వివరాలు అడగలేదు.

"అక్కడ నీకు డబ్బు ఇచ్చి పంపేసిందా?"

"లేదు. ఇరవై నిమిషాలు అక్కడ కాచుకునున్నాను. తర్వాత ఆమె వచ్చి మళ్ళీ కారెక్కింది."

"అక్కణ్ణించి ఎక్కడికి వెళ్ళావు?"

"అన్నామలైపురానికి వెళ్ళమని చెప్పింది. ఆళ్వారుపేట దాటక ముందే ఆమె కారు ఆపమన్నది."

"ఆపమని?"

"నాకు బాడుగ ఇచ్చేసి దిగిపోయింది."

"రోడ్ మీద ఎవరైనా స్నేహితులు కనిపించారా?"

"ఏమో? నాకు తెలియదు" అన్నాడు డ్రైవర్.

రాజు అతని చేతిలో రూపాయినోటు పెట్టి అక్కణ్ణించి బయలుదేరాడు. తిన్నగా ఆళ్వారుపేట కార్నర్‌కి వెళ్ళాడు. అప్పటికి బాగా పొద్దుపోయింది. ఆ కార్నరులో ఉన్న కిళ్ళీకొట్లు అన్నీ మూసి ఉన్నాయి. రిక్షా స్టాండులో ఒకే ఒక రిక్షా ఉన్నది. సరళ ఆనవాలు చెప్పి, అటువంటి మనిషిని అక్కడ ఆవాళ పొద్దున్న చూశావా అని రాజు రిక్షా అతన్ని అడిగాడు.

అరగంట క్రితమే తను స్టాండుకి వచ్చాననీ, పొద్దున్నుంచీ స్టాండులో లేనని అతను చెప్పాడు. తెల్లారితే కానీ ఈలోగా ఎవరిని వాకబు చేసీ ఏమీ ప్రయోజనం లేదని రాజు నిశ్చయించుకుని అక్కణ్ణించి తిన్నగా రాయపురానికి వెళ్ళాడు. పార్వతి ఇల్లు సులభంగానే కనపడ్డది. రాత్రి చాలా పొద్దుపోయినా ఆమె ఇంటిలో దీపాలు వెలుగుతున్నాయి.

రాజు తలుపు తట్టేసరికి ఒక యువతి వచ్చి తలుపు తీసింది. తన పేరు, తన వృత్తి, తను వచ్చిన పని చెప్పాడు రాజు.

"సరళ మా ఇంటికి రాలేదు" అన్నది పార్వతి.

"మీరు పొద్దున్న నుంచి ఇంట్లోనే ఉన్నారా?" అడిగాడు రాజు.

"సాయంత్రం సినిమాకి వెళ్ళాను. సరళ వచ్చివుంటే మా నాన్నగారు చెప్పేవారు. ఆయన ఇంటిలోనే ఉన్నారు."

"సుమతి, కృష్ణవేణిగార్ల చిరునామాలు మీకు తెలుసా?" అడిగాడు రాజు.

"ఎందుకు? సరళ అక్కడ ఉంటుందనా? ఉహూ ఇవాళ సాయంత్రం నేనూ, కృష్ణవేణి, సుమతి, సరళ కలిసి సినిమాకి వెళదాం అని ఏర్పాటు చేసుకున్నాం. కృష్ణ, సుమతి సాయంత్రం మా ఇంటికి వచ్చారు. సరళ కూడా సాయంత్రం ఇక్కడికి వస్తానన్నది. సరళకోసం చాలాసేపు కాచుకున్నాం. ఎంతసేపటికీ రాకపోయేసరికి, సినిమాకి టైం అయిపోతోందని మేము ముగ్గురం వెళ్ళాం. ఇప్పుడే థియేటరు నుంచి వాళ్ళిద్దరూ ఇళ్ళకు వెళ్ళారు" అన్నది.

"వాళ్ళిద్దరూ సినిమాకి బయలుదేరిన తర్వాత సరళ వాళ్ళిద్దరిలో ఎవరి ఇంటికయినా వెళ్ళివుండవచ్చుగా."

"ఏమో?"

"వాళ్ళ అడ్రసులు చెప్పడానికి మీకేమైనా అభ్యంతరమా?" అడిగాడు రాజు.

పార్వతి నవ్వింది. "లేదు. రాసుకోండి. కృష్ణవేణి, షావుకారు పేటలో మత్తు మొదలీ వీధిలో 114 ఇంటిలో ఉంటోంది. సుమతి, తిరువత్తూరులో సుబ్రమణ్యం కోవెల వీధిలో నెం 270 ఇంటిలో ఉంటోంది" అన్నది.

"థాంక్స్" అని రాజు వెనక్కి తిరిగాడు.

"మిస్టర్ ఒకమాట."

రాజు ఆగాడు.

"ఇంతకీ సరళ గురించి ఈ రభస ఎందుకో, అసలు సంగతేమిటో చెప్పనేలేదు" అడిగింది పార్వతి.

"ఏమీలేదు. ఆమె పొద్దున్న వెళ్ళింది. తిరిగి ఇంటికి రాలేదు. ఆమె అక్క మంగళ ఆదుర్దాపడి తన చెల్లెలి జాడ తెలుసుకోమని మమ్మల్ని అడిగింది. అంతే."

"సరళ మైనారిటీ వెళ్ళని చిన్నపిల్లకాదు. తన జాగ్రత్త తను చూసుకోగలదు. వాళ్ళక్కయ్యకి ఎందుకంత భయం?"

"ఏమో?"

"ఒకరోజు ఇంటికి రానంత మాత్రాన ఇంత రభస చేస్తే సరళకి కోపం వస్తుంది."

"ఎందుకు?"

"అందరికీ రహస్యాలుంటాయి కదూ" అన్నది నవ్వుతూ.

"అంటే విపులంగా చెప్పండి?"

"విపులంగా చెప్పడానికి ఏమీలేదు."

రాజు ఒక నిమిషం ఆలోచించాడు. "సరళకి మొగ స్నేహితులున్నారా?" అడిగాడు.

పార్వతి మళ్ళీ నవ్వింది. "ఏదో మాటవరసకి అన్నాను. విడిచిపెట్టేటట్లు లేరే" అన్నది.

"ఈ విషయం చెబితే నాకు పని తగ్గుతుంది. సరళ గురించి రభస తగ్గుతుంది"

పార్వతి మళ్ళీ నవ్వింది. "ఎంతమంది స్నేహితులున్నది నాకు తెలియదు. ఒక స్నేహితుణ్ణి మాత్రం చూశాను. ఒక రోజున మేము బీచికి వెళితే అక్కడికి వచ్చాడు."

"అతని పేరేమిటి?"

"నాకు జ్ఞాపకం లేదు. ఆవేళ సరళనీ, అతన్నీ కోడంబాకంలో దింపి నేను వెళ్ళిపోయాను."

"అతని పేరు జోగయ్యా?" అడిగాడు రాజు చటుక్కున.

"అవును."

"థాంక్స్" అని రాజు అక్కణ్ణించి బయలుదేరి తిన్నగా కోడంబాకం వచ్చాడు. కోడంబాకంలో స్టేషన్ దగ్గిర కారు ఆపి, పబ్లిక్ టెలిఫోను బూత్‌లోకి వెళ్ళి యుగంధర్‌కి ఫోను చేసి, జోగయ్య ఇంటి నెంబరు అడిగి తెలుసుకుని కారెక్కాడు, జోగయ్య ఇంటిముందు కారు ఆపాడు. ఇల్లు తాళం వేసి ఉంది. ఇంటిలో ఎవరూ లేరు. సరళ జోగయ్య ఇంటికి వెళ్ళివుంటే ఇద్దరూ కలిసి ఏ సినిమాకో వెళ్ళివుంటారు. సినిమాకి వెళ్ళివుంటే తిరిగి వచ్చే టయిం అయింది. రాజు కారు ఇంటికి దూరంగా తీసుకువెళ్ళి ఆపి, జోగయ్య ఇంటివైపు చూస్తూ నిలుచున్నాడు.

## 6

జోగయ్య అడ్రసు అడగడానికి రాజు టెలిఫోను చేసిన తర్వాత యుగంధర్ కన్సల్టింగ్ గదిలో దీపం ఆర్పి మేడపై ఉన్న తన పడక

గదిలోకి వెళ్ళాడు. సరళని వెదికి పట్టుకోవడం సాధ్యమైతే రాజు పట్టుకోగలడని యుగంధర్‌కి పూర్తి నమ్మకమున్నది. రొటీన్ దర్యాప్తు రాజు చాలా బాగా చేయగలడు. తను చేయవలసినది ఏమీలేదు.

పక్కమీద పడుకోగానే నిద్రపోవటం యుగంధర్‌కి అలవాటు. క్షణంలో నిద్రపోవటం, చీమ చిటుక్కుమంటే నిద్రలేపడం యుగంధర్‌కి మామూలే. అతని వృత్తికి ఆ అలవాటు చాలా అవసరం.

మంచం పక్కన ఉన్న బల్లమీద టెలిఫోను గణగణ మ్రోగేసరికి యుగంధర్ నిద్రలేచి పడుకునే రిసీవరు తీశాడు.

"యస్.. యుగంధర్ స్పీకింగ్"

"యుగంధర్ గారూ.. యుగంధర్ గారూ"

"ఆ"

"నేను మంగళని - యుగంధర్‌గారూ చాలా ఘోరం జరిగింది" ఒణుకుతున్న స్వరంతో గాభరాగా అంది మంగళ.

"ఏం జరిగింది?"

"ఎవరో పిస్తోలుతో కాల్చారు."

"ఎవరో ఎవర్నో పిస్తోలుతో కాల్చడమేమిటి?"

"అవునండీ. మా ఇంటి కాంపౌండులో ఎవరో ఎవర్నో పిస్తోలుతో కాల్చారు"

"మీకెలా తెలుసు?"

"పిస్తోలు పేలడం వినపడింది. కిటికీలోంచి తొంగి చూశాను. గేటు దగ్గిరవున్న నైట్ క్వీన్ పొదవెనక ఎవరో పడున్నారు. ఓ మనిషి పరుగెత్తుకు పోవడం చూశాను."

"మీరు వెళ్ళి చూడలేదా?"

"అమ్మయ్యో నేను వెళ్ళి చూడడమే?"

"ఇంట్లో మగవాళ్ళెవ్వరూ లేరా?"

"లేరు. దాసీది ఉంది. అది నాకన్నా భయస్తురాలు."

"పోలీసు స్టేషన్‌కి ఫోను చేయండి."

"చేస్తాను. ఈ ఘోరం మా కాంపౌండులో ఎందుకు జరిగింది?"

"నాకు ఎలా తెలుస్తుంది?"

"యుగంధర్ గారూ! సరళ కనిపించిందా?"

"లేదు, రాజు ఆ పనిమీదే ఉన్నాడు."

"యుగంధర్ గారూ! దయచేసి మీరు వెంటనే మా ఇంటికి రాగలరా?"

"ఎందుకు?"

"నాకెవరూ ఆప్తులు లెరు. పోలీసులూ గొడవ నాకు అలవాటు లేదు. మీరుంటే ధైర్యంగా ఉంటుంది."

యుగంధర్ కొంచెం విసుగ్గా "ఎవరో ఎవర్నో కాలిస్తే మీకెందుకు గాభరా?"

"ప్లీజ్ యుగంధర్ గారూ" ఆమె స్వరంలో దైన్యమూ, దుఃఖమూ ధ్వనించాయి.

"ఆల్ రైట్ వస్తున్నాను. మీరు పోలీసులకి రిపోర్టు ఇవ్వండి" అని చెప్పి యుగంధర్ చకచక దుస్తులు వేసుకుని బయలుదేరాడు. మంగళ ఇంటికి చేరుకునేటప్పటికి పోలీస్ నైట్ పెట్రోల్ కారొకటి ఇంటిముందు ఆగి ఉంది.

గేటు దగ్గర కాపలా ఉన్న కానిస్టేబుల్ యుగంధర్ పేరు వినగానే వినయంగా పక్కకి తొలిగి దారి చూపించాడు. కాంపౌండులో టార్చిలైటు వెలుగుతున్న వైపుకి నడిచాడు యుగంధర్.

నైట్ క్వీన్ పొద దగ్గర ఒక పోలీసు సార్జంటు ఒక కానిస్టేబుల్ నిలబడి ఉన్నారు. ఎవరో రావటం గమనించి సార్జంటు టార్చి వెలుగు అటు తిప్పాడు. యుగంధర్ని చూడగానే గుర్తుపట్టి, టార్చి పక్కకి తిప్పేసి "మీరా సార్?" అన్నాడు.

"అవును. నేనే. ఏమిటి జరిగింది?" అడిగాడు.

"కంట్రోలు రూం నుంచి మాకు వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది ఈ ఇంటికి వెళ్ళమని. మేము మా ఇంటికి వచ్చి తలుపు తడితే మేడ మీదనుంచి ఒకామె ఎవరో ఎవర్నో ఈ తోటలో పిస్తోలుతో కాల్చారని చెప్పింది. వెంటనే తోటలోకి వచ్చి చూస్తే ఇది కనిపించింది" అంటూ సార్జంటు టార్చి వెలుగు నేలమీద వేశాడు.

నైట్ క్వీన్ పొద దగ్గర నేలమీద మట్టిలో ఒక మనిషి పడుకున్నాడు. గూడకట్టు పంచ, వొదులైన లాల్చీ వేసుకున్నాడు. రెండూ కాషాయి రంగులో ఉన్నాయి. మెళ్ళో రుద్రాక్షమాల, జడలు కట్టిన నల్లని జుట్టు, గడ్డం, చెతికి ఒక వెండి తాయెత్తు, సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. కాళ్ళూ చేతులూ చాలా పొడుగ్గా ఉన్నాయి. పీక్కుపోయిన మొహం, సన్నని ముక్కు, గుంటలు పడ్డ కళ్ళు, జుట్టు నుదుటి మీద పడుతోంది. వెల్లికిలా పడుకున్నాడు. ఛాతీమీద నుంచి రక్తం కారి వీపు పక్కన మడుగు కట్టింది.

"కంట్రోల్ రూంకి వార్త పంపాను. ఇన్‌స్పెక్టర్ వస్తారు" అన్నాడు సార్జంటు.

సార్జంటు, పోలీస్ కానిస్టేబులు శవానికి కొంచెం దూరంగా నిలుచున్నారు.

"సరే ఇన్‌స్పెక్టర్ని రానియ్యండి. అంతవరకూ శవం దగ్గరకి వెళ్ళవద్దు. ఇన్‌స్పెక్టర్ రాగానే నన్ను పిలవండి" అని యుగంధర్ ఇంటివైపు నడిచాడు.

మంగళ హాల్లో సోఫా మీద కూర్చునున్నది. ఆమె వెనుక సోఫాని పట్టుకుని నిలుచున్నది దాసీది. మంగళ మొహం పాలిపోయి ఉంది.

"యుగంధర్ గారూ వచ్చారా?" అంటూ లేచి నిలుచున్నది ఆమె.

"కూర్చోండి. అసలు ఏం జరిగిందో చెప్పండి?" అడిగాడు యుగంధర్.

మంగళ ఓ నిమిషం పాటు మాట్లాడకుండా యుగంధర్ని చూస్తూ కూర్చున్నది. "భోజనం చేసి మేడమీద పడక గదిలోకి వెళ్ళి పడుకుని కాసేపు ఏదో పుస్తకం చదువుతున్నాను. పన్నెండు గంటల ప్రాంతాన దీపం ఆర్పేసి పడుకున్నాను. కొద్దిగా నిద్రపట్టిందనుకుంటాను.అంతలో 'ఢాం' అని పిస్తోలు చప్పుడు వినిపించింది. ఉలిక్కిపడి నిద్రలేచాను. కిటికీలోంచి చూశాను ఎవరో గేటులోంచి బయటకి పరిగెత్తుతున్నారు. నైట్‌క్వీన్‌పొద దగ్గిర ఎవరో పడున్నట్లు ఆకారం కనిపించింది. వెంటనే మీకు ఫోను చేశాను. అన్నది.

"ఆ పరిగెత్తిన మనిషి ఎలా ఉన్నాడు?"

"ఏమో? అస్పష్టంగా ఒక ఆకారం కనిపించిది. అంతే. ఎలా ఉంటాడో చెప్పలేను. ఇంత దూరం నుంచి ఎలా తెలుసుకోగలను?"

"మీ దాసీది చూసిందేమో?"

"లేదు. అది వంటింటి పక్కన ఉన్న వసారాలో పడుకుంది. నేను వెళ్ళి లేపిందాకా నిద్ర లేవనే లేదు. ఆ పడివున్న మనిషి ఎవరు? చచ్చిపోయాడా?" అడిగింది మంగళ.

"అవును, చచ్చిపోయాడు. ఎవరో సన్యాసిలా ఉన్నాడు. మీకెవరయినా సన్యాసి తెలుసా?"

మంగళ రెండు నిమిషాలు ఆలోచించింది. తల తిప్పి "ఉహూ ఏ సన్యాసితోనూ నాకు పరిచయంలేదు. నా కటువంటి నమ్మకాలు లేవు" అన్నది.

అంతలో పోలీసు కానిస్టేబులు వచ్చి ఇన్స్పెక్టర్ వచ్చారని చెప్పాడు.

యుగంధర్ అతనితో శవం ఉన్న చోటికి వెళ్ళాడు.

డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు పాంటు జేబులో చేతులు పెట్టుకుని శవం పక్కన నిలుచుని చూస్తున్నాడు.

"హల్లో ఇన్స్పెక్టర్ మీరే వచ్చారా?" అన్నాడు యుగంధర్.

"కష్టమైన కేసులన్నీ ఏ.సి నాకే అప్పచెపుతారుగా"

"ఇది కష్టమైన కేసా?" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"అలాగే కనిపిస్తోంది యుగంధర్.. ఏమిటి గొడవ?" అడిగాడు స్వరాజ్యరావు.

"నాకు ఏమీ తెలియదు." అని యుగంధర్ మంగళ తనకి ఫోను చేయడం, తను రావడం మంగళతో మాట్లాడిన విషయాలు చెప్పాడు.

"మీకు ఆమెతో ఇంతకు ముందు పరిచయముందా?"

"అవును" అన్నాడు యుగంధర్ ముక్తసరిగా.

స్వరాజ్యరావు జేబులోనుంచి సిగరెట్ కేసు తీసి, యుగంధర్‌కి ఓ సిగరెట్ ఇచ్చి, తనొకటి వెలిగించి, ఆరిపోయిన అగ్గిపుల్లను జాగ్రత్తగా జేబులో వేసుకున్నాడు.

"ఇతన్ని పిస్తోలుతో కాల్చి చంపారు. ఇతని అడుగు జాడలు కాక మరొక రెండు జతల అడుగుజాడలు కూడా ఉన్నాయి ఇక్కడ" అంటూ స్వరాజ్యరావు టార్చి వెలుగు నేలమీద వేశాడు. "శవం పక్కన అడుగుజాడలున్నాయి. అందులో ఒక జత హతుడివి. ఇంకో రెండు జతలున్నాయి. ఒక జత స్త్రీ అడుగుజాడలు. ఇంకో జత పురుషుడివి. ఆ రెండు జతలు గేటు వైపుకి వెళుతున్నాయి. ఈ జాడలు దూర దూరంగా ఉన్నాయి. కనుక ఇద్దరూ పరిగెత్తారనుకోవచ్చు."

యుగంధర్ తల ఊపాడు.

"పోలీస్ సర్జన్ కాసేపట్లో వస్తాడు. ఆయన వచ్చి మనకి చెప్పగలిగిందేమీ ఉండదు. పిస్తోలుతో కాల్చి చంపబడ్డాడని తెలుస్తూనే ఉంది. ఎప్పుడు చంపబడిందీ కూడా తెలుస్తూనే ఉంది. ఈ ఇంట్లోనుంచి మీకు ఫోను చేసిన ఆమెని ఒకసారి వచ్చి శవాన్ని చూడమనడం మంచిది. ఆమెకు తెలిసిన మనిషేమో? ఎవరో అపరిచితుడు. ఎందుకు ఈమె ఇంట్లోకి వస్తాడు?" అన్నాడు మళ్ళీ స్వరాజ్యరవు.

"ఆమెని పిలిపించండి" చెప్పాడు యుగంధర్.

మంగళని పిలుచుకు రమ్మని సార్జంటుని పంపాడు స్వరాజ్యరావు.

యుగంధర్ శవం దగ్గరికి వెళ్ళాడు. మోకాళ్ళ మీద కూర్చుని టార్చి వెలుగులో శవాన్ని పరిక్షగా చూశాడు. గుండు సరిగ్గా గుండెలో తగిలింది. రక్తం అక్కడి నుంచే కారింది. ఆ మనిషి చొక్కాకి జేబులు లేవు. చేతిలో సంచిలేదు. అతనెవరో తెలిసే నిదర్శనాలు ఏమీలేవు. యుగంధర్ లేచి నిలబడుతుండగా టార్చి వెలుగు పక్కకి పడింది. ఆ వెలుగులో ఏదో మెరిసింది.

"అదేమిటి?" అంటూ యుగంధర్ అటు వెళ్ళాడు. స్వరాజ్యరావు కూడా యుగంధర్ వెనకే వెళ్ళాడు. శవానికి పదడుగుల దూరంలో గడ్డిలో పడివున్నది పిస్తోలు.

యుగంధర్ ఒంగాడు.

"వాటిని ముట్టుకోవద్దు. వేలిముద్రలుంటాయి" అని అరిచాడు స్వరాజ్యరావు.

యుగంధర్ నవ్వాడు, "అలాగా!" అన్నాడు వ్యంగ్యంగా. ఒంగి, టార్చి వెలుగులో ఆ అట్టపెట్టెను, పిస్తోలుని పరీక్షగా చూశాడు. అది 32 కాలిబర్ పిస్తోలు.

ఆ అట్టపెట్టె నగలపెట్టె, యుగంధర్ దాన్ని నిన్న రాత్రి చూశాడు. ఆ పెట్టెనే అతడు జోగయ్య దగ్గరినుంచి తెచ్చి సరళకి ఇచ్చాడు. ఆ పెట్టెలోనే వజ్రాల నెక్లెస్ - లక్ష రూపాయల ఖరీదయిన నెక్లెస్ ఉన్నది. పెట్టె మూసిఉంది. అందులో నెక్లెస్ ఉందా? అది ఇక్కడికి ఎలా వచ్చింది? జేబులోంచి రుమాలు తీశాడు. జాగ్రత్తగా అట్టపెట్టెని రుమాలుతో పట్టుకుని మూత తెరిచాడు. అట్టపెట్టె ఖాళీగా ఉంది. అందులో నెక్లెస్ లేదు. పెట్టెమూత మూసేసి యథాస్థానంలో పెట్టేశాడు.

"హత్యకి కారణం దొంగతనం అయివుండాలి. అది నగల పెట్టె కదూ" అన్నాడు స్వరాజ్యరావు.

"అయ్యుండవచ్చు" అని యుగంధర్ జవాబు చెబుతుండగా సార్జంటు మంగళని వెంటబెట్టుకుని వచ్చాడు.

"ఈయన ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు. ఈమె మంగళాదేవి" అని పరిచయం చేశాడు యుగంధర్.

మంగళ తల ఊపింది. బిత్తర చూపులతో నేలవేపు చూస్తున్నది.

"మీకు శ్రమ కలిగిస్తున్నందుకు చింతిస్తున్నాను. దయచేసి ఒకసారి శవాన్ని చూసి మీకు ఆ మనిషి తెలుసునేమో చెబుతారా?" అన్నాడు స్వరాజ్యరావు.

మంగళ తల ఊపింది.

సార్జంటు, కానిస్టేబుల్ టార్చీలు వెలిగించి వెలుగు శవం మీద వేశారు. మంగళ ఒక క్షణం శవం మొహం చూసింది. తల తిప్పేసుకున్నది. "ఎవరో నాకు తెలియదు" అన్నది.

"ఓసారి ఇటురండి" అంటూ స్వరాజ్యరావు మంగళని నగలపెట్టె పడివున్న చోటికి పిలుచుకు వెళ్ళాడు. కిందపడివున్న పెట్టెమీద టార్చి వెలుగు వేసి "ఇది మీదేనా?" అడిగాడు. మంగళ అయిదు నిమిషాలపాటు ఆ పెట్టె వైపు నిశ్చలంగా చూస్తూ ఉండిపోయింది. చివరికి "అవును" అన్నది.

స్వరాజ్యరావు ఒక నిట్టూర్పు వదిలి "అయితే దొంగతనం జరిగిందన్నమాట. ఇంట్లో ఈ పెట్టె ఎక్కడ పెట్టారు?" అడిగాడు మంగళని.

"అది నా దగ్గిర లేదు" అని యుగంధర్ వంక ప్రాధేయపూర్వకంగా చూసింది.

స్వరాజ్యరావు కాస్త చికాకుగా చూశాడు. "అంటే?" అడిగాడు.

"నా భర్త దగ్గరున్నదది."

"మీ భర్త దగ్గిర ఉన్నదంటే? అర్థమయ్యేటట్లు చెప్పండి"

"ఆయనా, నేను విడిగా ఉంటున్నాం. ఆయన ఇంటిలో ఇనప్పెట్టెలో ఉండాలి ఈ అట్టపెట్టె. అందులో నా నెక్లెస్"

"ఓ అలాగా" అని క్షణం ఆగి, "మీరు ఇంటిలోకి వెళ్ళండి నేను వస్తాను." అన్నాడు స్వరాజ్యరావు.

మంగళ యుగంధర్ని మరొకసారి చూసి ఇంటిలోకి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన తర్వాత ఇనస్పెక్టర్ యుగంధర్ వైపు తిరిగి "ఏమిటి కథ యుగంధర్?" అడిగాడు.

"అది చాలా పెద్ద కథ. తర్వాత నింపాదిగా చెబుతాను. అదుగో కారు వచ్చింది. పోలీస్ సర్జన్ అనుకుంటాను. వేలిముద్రల వాళ్ళూ, ఫోటోగ్రాఫర్లు కూడా వచ్చి ఉంటారు. ముందు ఆ పనులు కానియ్యండి" అని యుగంధర్ కూడా ఇంట్లోకి వెళ్ళాడు.

(కొనసాగింపు వచ్చేసంచికలో)